
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 4 జూన్ 2024

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.170	230	260
నల్లగొండ	రూ.152	220	250

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 24.0



నల్లగొండలోని దుప్పలపల్లిలోని గోదాంలో ఏర్పాటు చేసిన అధికారులు

మండు వేసవిని సైతం లెక్క చేయకుండా ఓటేసిన ప్రజల మనోగతం నేడు బహిర్గతం కానుంది. నరాలు తెగే ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ప్రధాన పార్టీల భవితవ్యం నేటి మధ్యాహ్నానికి తేలిపోనుంది. గత నెల 14వ తేదీన జరిగిన నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఓట్ల లెక్కింపును నేడు చేపట్టనున్నారు. ఇందుకోసం ఆయా జిల్లాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నల్లగొండ ఓట్ల లెక్కింపును దుప్పలపల్లి సమీపంలోని గోదాంలో, భువనగిరి ఓట్ల లెక్కింపును భువనగిరి శివారులోని అరోరా కళాశాలలో చేపట్టనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే లెక్కింపునకు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు.



భువనగిరిలోని అరోరా కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నేడు ఉత్కంఠకు తెర

- భవితవ్యం తేలేది నేడే
- తొలి ఫలితం మిర్యాలగూడదే
- పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- నల్లగొండలో 14 టేబుళ్లు, 24 రౌండ్లలో ఫలితాలు
- ఉదయం 8 నుంచి మొదలవనున్న కౌంటింగ్

నల్లగొండ,జూన్ 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఫలితాల ఉత్కంఠకు నేడు తెరపడనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానాల నుంచి గెలిచేదెవరో నేడు తేలిపోనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో కొనసాగుతుంది. కౌంటింగ్ ప్రక్రియ ఆసాంతం పకడ్బందీగా కొనసాగేందుకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8గంటలనుంచే మొదలయ్యే కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఫలితాలు వెలువడనున్నాయి. నల్లగొండ లోక్‌సభలో తక్కువ రౌండ్లున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొదటి ఫలితం వెలువడనుండగా, చివరగా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం వెలువడుతుంది. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి 22 మంది అభ్యర్థులు బరిలో నిలవగా ప్రధాన పోటీ రఘువీర్ కుందూరు (కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ) మధ్య కొనసాగింది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో మొత్తం 17,25,465 ఓట్లకు, మే 13న జరిగిన పోలింగ్‌లో 74.02శాతం అంటే 12,77,137 ఓట్లు పోలయ్యాయి.

నల్లగొండ పార్లమెంట్	
దేవరకొండ	24
నల్లగొండ	21
నాగార్జునసాగర్	22
హుజూర్‌నగర్	22
కోదాడ	22
సూర్యాపేట	22
మిర్యాలగూడ	19
మొత్తం రౌండ్లు	152

మొత్తం ఓట్లు	17,25,465
పోలైన ఓట్లు	12,77,137
పురుషులు	8,44,843
స్త్రీలు	6,43,450
పోలింగ్ శాతం	74.02

అభ్యర్థులు (బరిలో ఉన్న) 22

తొలుత పోస్టల్ బ్యాలెట్

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక హాల్ వద్ద పోస్టల్ బ్యాలెట్లను తొలుత లెక్కిస్తారు. మొత్తం 24 టేబుళ్లపై ఈ బ్యాలెట్లను లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ ముగిశాక ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అయిదు పోలింగ్ బూత్‌లకు సంబంధించిన వీవీ ప్యాట్లను లెక్కించి, ఈవీఎం ఓట్లతో పోల్చి పరిశీలిస్తారు. అన్నిరౌండ్ల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పూర్తికానుంది.

నల్లగొండ లోక్‌సభ పరిధిలో..

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓట్ల లెక్కింపు 24రౌండ్లుగా చేపడతారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లను కౌంటింగ్‌కోసం ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌లో ఒక్కో టేబుల్‌పై ఒక్కో ఈవీఎంలలో ఓట్లని లెక్కిస్తారు. ఈలెక్కన తక్కువగా 264 పోలింగ్ కేంద్రాలున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓట్ల లెక్కింపు 19రౌండ్లలో పూర్తయితే, ఎక్కువగా 324 పోలింగ్ కేంద్రాలున్న దేవరకొండ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 24రౌండ్ల వరకు కొనసాగుతుంది. 288 పోలింగ్ స్టేషన్లున్న నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ లెక్కింపు 21రౌండ్లలో కొనసాగనుంది. 306 పోలింగ్ కేంద్రాలున్న నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు 22 రౌండ్లలో, 296 పోలింగ్ స్టేషన్లున్న కోదాడలో 22 రౌండ్లు, 291 పోలింగ్ స్టేషన్లున్న సూర్యాపేటలో 22 రౌండ్లలో లెక్కింపు కొనసాగుతుంది.

144 సెక్షన్ అమలు

లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఎలాంటి ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

యాదాద్రి, జూన్3(ఆంధ్రజ్యోతి): నేడు లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లాయంత్రాంగం రంగం సిద్ధంచేసింది. భువనగిరి పార్లమెంట్ స్థానానికి 39మంది బరిలో ఉన్నారు. ఎంపీగా పార్లమెంట్‌లోకి అడుగు పెట్టేదెవరు అన్నది నేడు తేలనుంది. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఓట్ల క్కింపు సందర్భంగా పటిష్ఠమైన భద్రత ను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. భువనగిరి నియోజకవర్గ పరిధిలో భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, జనగాం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈవీఎం కౌంటింగ్‌కు సంబంధించి ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెం ట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం ఫలితా లు నమోదు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ప్రత్యేక హాల్ ఏర్పాటు చేశారు. హోం ఓటింగ్, విధుల్లో ఉన్న సిబ్బందికి సంబంధించిన ఓటర్లను 14 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ చేయనున్నారు. ఒక టే బుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, తహసీల్దార్ స్థాయి అధికారి ఏఆర్వోగా ఉంటారు. 14 టేబుళ్లకు సంబంధిం చి ఏఆర్వోలు ఉంటారు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి ఈటీపీబీఎస్ పద్ధతితో స్కానింగ్ ద్వారా కౌంటింగ్ చేస్తారు.

కౌంటింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు నియోజకవర్గ అబ్జర్వర్లు రాబర్ట్ క్షేత్రమాయూమ్, ఎండీ ఎజ్జా హుస్సేన్ పర్యవేక్షిస్తారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా కౌంటింగ్ సిబ్బంది ప్రతి ఒక్కరికీ పాస్‌లు అందించారు. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉండగా, వారికి కూడా పాస్‌లు అందజేశారు. పాస్‌లు ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ హాల్లోకి ప్రవేశం ఉంటుంది. ఫలితాలు మధ్యాహ్నం తర్వాతే వెలువడనున్నాయి. జిల్లాలోని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 18,08,585 ఓటర్లు ఉండగా, 13,88,680 ఓట్లు పోలయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 76.78 శాతం పోలింగ్ నమోదైంది. కౌంటింగ్ కేంద్రం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. భువనగిరి లోక్‌సభ నుంచి 39మంది అభ్యర్థులు బరిలో నిలిస్తే, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), బూరనర్సయ్యగౌడ్ (బీజేపీ), క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్) నడుమ ప్రధాన పోటీ నెలకొంది.

భువనగిరిలో మూడంచెల భద్రత

కౌంటింగ్ కోసం భువనగిరిలో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతీ స్ట్రాంగ్ రూం వద్ద సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందితోపాటు రాష్ట్ర సాయుధ సిబ్బంది, ఏఆర్ ఫోర్సు, సివిల్‌ఫోర్సు ఉంటుంది. స్పెషల్ ఫోర్సు కూడా ఉంటుంది. మొబైల్ ఫోన్లు, పేపర్లు, తదితర వస్తువులు కౌంటింగ్ హాల్లోకి అనుమతించబోరు. లెక్కింపు ప్రక్రియను సీసీటీవీ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్ పర్యవేక్షించనున్నారు. రెండు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు కేంద్రానికి చేరుకుంటుండడంతో పోలీసులు 200మీటర్ల అవతలే ఉండాలని సూచించారు.

భువనగిరి పార్లమెంట్	
భువనగిరి	19
ఆలేరు	20
మునుగోడు	18
తుంగతుర్తి	19
నకిరేకల్	23
జనగాం	20
ఇబ్రహీంపట్నం	18
మొత్తం రౌండ్లు	137

మొత్తం ఓట్లు	18,08,585
పోలైన ఓట్లు	13,88,680
పురుషులు	8,98,416
స్త్రీలు	6,86,003
పోలింగ్ శాతం	76.47

అభ్యర్థులు (బరిలో ఉన్న) 39

ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి




కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ టౌన్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్‌రావు సూర్యవంశి అన్నారు. సోమవారం ఆయన కౌంటింగ్ ఎన్నికల పరిశీలకులు ఉపేంద్ర కుమార్‌తో కలిసి దుప్పలపల్లి గోదాంలో పార్లమెంట్ ఎన్నికల ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, అలాగే కౌంటింగ్ కేంద్రాలను తనిఖీచేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

కౌన్ బనేగా ఎంపీ?

- అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

యాదాద్రి, జూన్3(ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్ పోల్స్‌తో నేతల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సారి ఎలాగైనా గట్టెక్కుదామని ఆశలు పెంచుకున్న నేతలకు అంచనాలు తారుమారు అవుతాయా? అనే అలజడి మొదలైంది. కౌన్ బనేగా భువనగిరి ఎంపీ అన్నది మంగళవారం మధ్యాహ్నం వరకు తేలనుంది. సార్వత్రిక ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకుని హ్యాట్రిక్ సాధించాలని ఎన్‌డీఏ... ఈ సారి ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇండియా కూటమి, ఇతర పార్టీలు, స్వతంత్రులు హోరాహోరీగా పోటీపడ్డాయి. అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల శ్రేణులు ఎన్నికల్లో విజయం సాధించేందుకు 45రోజులపాటు తీవ్రంగా శ్రమించాయి. ఈ ఎన్నికల్లో జిల్లా ఓటర్లు ఎవరికి పట్టం కడతారు? ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారు? ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తాయా? అన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేటితో అభ్యర్థుల్లో ఉత్కంఠకు తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికలకు కీలకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను సర్వం సిద్ధమైంది. ఎన్నికల ఫలితాలకోసం పోటీలో ఉన్న అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇబ్రహీంపట్నం, జనగాం, భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సారి జరిగిన ఎన్నికలు మునుపెన్నడూ లేని విధంగా జిల్లాలో పోటాపోటీగా పోరు సాగింది. రికార్డుస్థాయిలో పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో అత్యధికంగా 76.78శాతం ఓటింగ్ నమోదైంది. అభ్యర్థుల భవితవ్యం తేల్చే ఓట్ల లెక్కింపు ఘడియలు రానే వచ్చాయి. దీంతో అభ్యర్థుల్లో మరింత హైటెన్షన్ ప్రారంభమైంది. ఎన్నికల ఫలితాలు పోటాపోటీగానే ఉంటాయని సర్వేలు వెల్లడించడంతో స్వతంత్రులు, తిరుగుబాట్ల ఓట్లు చీలికపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. బీఆర్ఎస్, బీజేపీ ఒకవైపు, అధికార కాంగ్రెస్ మరోవైపు నియోజకవర్గాల్లోని పల్లెలు, పట్టణాల్లో ప్రచార హోరెత్తించాయి. దీంతో ఈ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అన్న ఆసక్తి రేపుతోంది. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో జిల్లాలోని అన్ని ప్రధాన పార్టీ శ్రేణులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఏ పార్టీకి మెజార్టీ లభిస్తుందోనని నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో ఏ పార్టీకి అధికార పీఠం దక్కుతుందోనని ఆసక్తిగా మారింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఓటర్ల నాడి గుంభనంగా ఉండటంతో ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారనే స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. అభ్యర్థుల గెలుపోటములను తేల్చిచెప్పే సమయం ఆసన్నమైంది. మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసి అదే రోజు ఫలితాలు ప్రకటించడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గెలుస్తామా? ఓడిపోతామా.. అనేది స్పష్టత లేకపోవడంతో అందరిలోనూ ఫలితాల జ్వరం పట్టుకుంది. ఎవరికి వాళ్లు కూడికలు... తీసివేతల లెక్కల్లో మునిగితేలుతున్నా.. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో గెలుస్తామో అన్న ఆందోళన ప్రారంభమైంది.



ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు

కలెక్టర్



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాబర్ట్ సింగ్, ఎజ్జబా హుస్సేన్

భువనగిరి అర్బన్: భువనగిరి పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు జరిగినట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ నేడు నిర్వహించే ఓట్ల లెక్కింపు సిబ్బంది ఎన్నికల లెక్కింపు పరిశీలకులు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమాయూమ్, ఎం.డీ ఎజ్జబా హుస్సేన్ సమక్షంలో కేటాయించినట్లు చెప్పారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సిబ్బందిని కేటాయించామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, డీఈవో కే.నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏవో సి.జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపఎన్నిక కౌంటింగ్‌లో షిఫ్ట్‌ల వారీగా విధులు



నల్లగొండ టౌన్, జూన్ 3 : శాసనమండలి ఉపఎన్నిక కౌంటింగ్‌లో షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించాలని కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు సహనంతో అప్రమత్తంగా పనిచేయాలని, గంట ముందే సిబ్బంది కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపఎన్నిక లెక్కింపు ప్రక్రియపై సోమవారం కలెక్టరేట్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియలో ఎవరెవరి విధులు ఎలా ఉన్నాయి, వాటిని ఏవిధంగా చేయాలనే దానిపై, ప్రాథమిక కౌంటింగ్ మొదలు నుంచి ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా ఫలితం వెలువడే వరకు చేయాల్సిన విధులు, చేయకూడని పనులకు సంబంధించి వివరిస్తూ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది ఎంత వేగంగా జాగ్రత్తగా పనిచేస్తే అంతవేగంగా ఫలితాలు వస్తాయన్నారు. కౌంటింగ్ సిబ్బందికి షిఫ్టుల వారీగా విధులను కేటాయించామని, ప్రతి ఒక్కరూ గంట ముందుగానే రిపోర్ట్ చేయాలన్నారు. కౌంటింగ్ విధుల్లోని సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకురావద్దని, బయటి నుంచి ఎటువంటి వస్తువులు తీసుకురావద్దన్నారు. ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కావడంతో ఫలితం రావడానికి సమయం పడుతున్నందున మొదటి రౌండ్ నుంచి చివరి రౌండువరకు అప్రమత్తతతో సహనంగా ఉండాలని కోరారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పులిచింతల స్పెషల్ కలెక్టర్ నటరాజన్, డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, శిక్షణా కార్యక్రమాల నోడల్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్, ట్రైనర్ బాలు పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



శిక్షణ పొందిన హాకీ క్రీడాకారులతో జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి మక్బూల్ మహ్మద్

చిట్యాల రూరల్, జూన్ 3 : క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి మక్బూల్ మహ్మద్ అన్నారు. మే 1 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు మండలంలోని ఉరుమడ్లలో హాకీ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 70మంది శిక్షణపొందారు. సోమవారం ముగింపు సందర్భంగా మక్బూల్ మహ్మద్ హాజరై శిక్షణ క్రీడాకారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు శరీర ధృఢత్వాన్ని ఆరోగ్యాన్ని అందిస్తాయని ముఖ్యంగా క్రమశిక్షణతో పాటుగా తోటి క్రీడాకారులతో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉపాధి ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుంకరి ధనమ్మయాదగిరి, ఎంపీటీసీ పెద్దగోని సత్తయ్యయాదవ్, గంగాపురం రాము, జాతీయ క్రీడాకారిణి మర్రి కల్పన, జన్నపాల కిషన్, కొయ్యడి సత్యనారాయణ, సాగర్ల వెంకటేష్, వరికుప్పల శేఖర్, ఉయ్యాల నాగరాజు, వెలుగు చంద్రశేఖర్, రాము విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులకు స్థానికుడు పట్ల నర్సింహ అల్పాహారాన్ని అందించారు.

పరిహారం పేర నిధుల గోల్‌మాల్?

- ఆర్డీవో కార్యాలయ కేంద్రంగా సిబ్బంది నిధుల దోపిడీ
- గుట్టుగా పోలీసుల విచారణ



భూనిర్వాసితుల పేర ఆర్డీవో కార్యాలయ సిబ్బంది నిధుల దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఓ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన చెక్కులతో కొందరు బ్యాంకులో నగదును డ్రా చేసిన విషయమై పోలీసులు గుట్టుగా విచారణ కొనసాగిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అనర్హులకు చెక్కులు అందజేయడం వెనుక కార్యాలయ సిబ్బంది హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

\- మిర్యాలగూడ

భూనిర్వాసితులకు ప్రభుత్వం అవార్డు అందజేసినట్లు చెప్పుకుంటూ స్థానికంగా ఓ బ్యాంకు నుంచి రూ.5.45 లక్షల విలువైన చెక్కు డ్రా చేసేందుకు బ్యాంకుకు వెళ్లగా చెక్కుపై ఉన్న సంతకం తేడా ఉండటంతో నకిలీ చెక్కుగా భావించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. పోలీసులు చెక్కు విషయమై ప్రస్తుత ఆర్డీవో శ్రీనివాసరా వు దృష్టికి తేగా పూర్తిస్థాయిలో కేసును విచారించాల్సిందిగా ఆర్డీవో పోలీసులకు రాతపూర్వక ఫిర్యాదుచేయడంతో పాటు కలెక్టర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా వారం రోజుల్లో అదే విలువ కలిగిన మూడు చెక్కులను మొత్తం విలువ రూ.16.35 లక్షలు డ్రా చేసుకొని నగదు తీసుకెళ్లినట్లు గుర్తించారు. గతంలో మిర్యాలగూడ ఆర్డీవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన చెన్నయ్య సంతకాలను ఫోర్జరీ చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

బ్యాంకు అధికారుల హస్తం?

నకిలీ అవార్డు రైతుల చెక్కుల డ్రా వెనుక బ్యాంకు అధికారుల హస్తం ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలిసింది. చెక్కుపై చిన్న కరెక్షన్ ఉంటే విత్‌డ్రాకు పేచీపెట్టే బ్యాంకు అధికారులు ఓ చెక్కుపై అంకెల్లో రూ.5.45 లక్షలు వేసిఉండగా అక్షరాల్లో ఐదు లక్షల యాభై ఐదు వేలు అని రాసి ఉన్నా నగదు విత్‌డ్రా అయినట్లు పోలీసు విచారణలో గుర్తించినట్లు సమాచారం. బ్యాంకులో సీసీ ఫుటేజీ ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగదును బొద్దుపల్లి కోటయ్య ఒక చెక్కు, నర్రాముల లింగస్వామి రెండు చెక్‌లు విత్‌డ్రా చేయగా దొండ శ్రీకాంత్ యాదవ్ నగదు డ్రా చేయడానికి వెళ్లి బ్యాంకు అధికారులకు దొరికిపోయినట్లు తెలుస్తోంది. వీరికి కమీషన్ ఇచ్చే ఒప్పందంలో బ్యాంకులో చెక్కులు ఇచ్చి డ్రా చేసేందుకు సైదులు అనే వ్యక్తి కీలకంగా వ్యవహరించినట్లు విశ్వసనీయసమాచారం. సదరు వ్యక్తి ఆర్డీవో కార్యాలయంలో గతంలో తాత్కాలికంగా ఆపరేటర్‌గా పనిచేసిన ఉద్యోగి అద్దెకు ఉండే ఇంటి యజమానిగా గుర్తించినట్లు సమాచారం. సదరు ఆపరేటర్ థర్మల్ ప్లాంట్ సేకరణ భూముల్లో తనకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఉన్నట్లుగా చూపి రూ.25 లక్షల నష్టపరిహారం పొందడానికి ప్రయత్నించగా గుర్తించిన అధికారులు నగదు విత్‌డ్రా కాలేదు కనక మొదటి తప్పుగా భావించి వదిలివేయడంతో ఉద్యోగాన్ని వదిలి వేశాడని తెలిసింది.

బినామీలకు పరిహారం?

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణం కోసం 2016-18 సంవత్సరంలో దామరచర్ల మండలం వీర్లపాలెం పరిసర గ్రామాల్లోని ఏడు గ్రామాల నుంచి సుమారు 1,050 ఎకరాలు సేకరించారు. వీరందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం పరిహారం చెల్లించినట్లు గతంలో అధికారులు ప్రకటించారు. కాగా నష్టపరిహారం పొందిన వారిలో పలువురు బినామీలు కూడా ఉన్నట్లు అప్పట్లో పలు ఆరోపణలు వచ్చాయి. అన్ని రాజకీయ పార్టీల్లోని పలువురు నేతలు పరిహారం సొమ్మును పొందినట్లుగా విమర్శలు సాగాయి. గతేడాది ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేసేందుకు విష్ణుపురం నుంచి థర్మల్ ప్లాంట్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు కోసం గత ఏడాది మరో 365 ఎకరాలు, కృష్ణనది నుంచి ప్లాంట్ వరకు పైపులైన్ ఏర్పాటుకు 81 ఎకరాలు సేకరించారు. సంబంధిత వ్యక్తులకు పరిహారం చెల్లించేందుకు సుమారు రూ.90 కోట్ల మేర నిధులు బ్యాంకు ఖాతాలో జమఅయినట్లు సమాచారం. బినామీలకు పరిహారం చెల్లింపులో దామరచర్లకు చెందిన కొందరు రెవెన్యూ అధికారుల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ప్లాంట్‌లో జస్టిస్ నర్సింహారెడ్డి ప్రత్యక్ష విచారణ సందర్భంగా ఆర్వోఎఫ్ఆర్ భూముల పరిహారంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించినట్లు ప్రచారం సాగుతోంది. సేకరించిన భూమి కంటే లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఉన్నతాధికారులు ప్రమేయంపైనా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. నిధుల గోల్‌మాల్, బినామీలకు అందిన పరిహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రిజర్వేషన్లు పెంచుతారనే బీసీల్లో విశ్వాసం



పలివెలలో విలేకర్ల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు రూరల్, జూన్ 3 : బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు పెంచుతారన్న నమ్మకం బీసీలకు ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని పలివెల గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ చేసిన పొరపాటు రేవంత్‌రెడ్డి చేయడని భావిస్తున్నామని, రిజర్వేషన్లు పెంచి బీసీల వాటా బీసీలకు దక్కాకే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో బీసీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర నాయకులు జనగాం రవీందర్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్, రాష్ట్ర కార్యదర్శి బూడిద మల్లికార్జున్‌యాదవ్, జిల్లా నాయకులు ఈదులకంటి కైలాస్, గణం నరసింహ, వీరమల్ల కార్తీక్, లక్ష్మణ్, కందుల లింగస్వామిగౌడ్, జక్కులు శ్రీశైలం గౌడ్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో జిల్లా విద్యార్థికి 12వ ర్యాంకు



రుద్రవిశ్వేశ్వర్ కుమార్

నల్లగొండ , జూన్ 3 : టీఎస్ పాలీసెట్ పరీక్ష ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన రుద్ర విశ్వేశ్వర్‌కుమార్ రాష్ట్రస్థాయి ఎంపీసీ విభాగంలో 12వ ర్యాంక్ సాధించాడు. ది నల్గొండ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. ఇటీవల పదోతరగతి ఫలితాల్లో జిల్లా స్థాయి టాపర్‌గా నిలవడంతో పాటు ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే పాలీసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించాడని తల్లిదండ్రులు రుద్ర రామకృష్ణ, సునీత తెలిపారు. తమ కుమారుడు స్టేట్ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో సివిల్స్ సాధించడమే అతడి లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు విశ్వేశ్వర్‌కుమార్‌ను అభినందించారు.

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, జూన్ 3: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3 పరీక్షా కేంద్రాల్లో 590 మంది విద్యార్థులకు గాను 532 విద్యార్థులు హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారు. కాగా జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.

నేడు, రేపు మద్యం దుకాణాలు బంద్

నల్లగొండ, జూన్ 3: పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో జిల్లా వ్యాప్తంగా మందు దుకాణాలు బంద్ ఉండనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్

- నల్లగొండ జిల్లా చిట్యాలలో రోడ్డు ప్రమాదం
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాసి





కుటుంబరావు మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ లింగయ్య

చిట్యాలరూరల్, జూన్ 3: జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్ఐ - 2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమటి ప్రైవేట్ ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ అరిగిల మణికంఠతో పాటుగా బయలుదేరాడు. మార్గమధ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి దాటాక చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే పెట్రోల్ బంకు నుంచి లారీ అకస్మాత్తుగా వేగంగా రోడ్డు మీదకు వచ్చింది. దీంతో బస్సు అదుపుకాక లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటుగా డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. మృతుడు కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగయ్య పేర్కొన్నారు.

'200 రోజులు ఉపాధి పని కల్పించాలి'

మాడ్గులపల్లి, జూన్ 3: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతీ కూలీకి 200 రోజుల పనిదినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మన్నెం భిక్షం, గండమల్ల రాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీకి రూ.130, రూ.150 చెల్లిస్తే కుటుంబాలకు ఎలా పోషించుకుంటారని వారు ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గుంటోజు వెంకటాచారి, బొంగర్ల వెంకటయ్య, బొల్లెద్దు నాగయ్య, నగిరె కిష్టయ్య, వంశీ, కృష్ణ, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

50.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

● చల్లబడిన వాతావరణం ● పల్లెల్లో వ్యవసాయ పనుల సందడి



నల్లగొండ, జూన్ 3: నైరుతి ప్రభావంతో వర్షాలు పడడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పల్లెల్లో వ్యవసాయ పనుల సందడి మొదలైంది. చాలాచోట్ల విత్తనాలు వేయడం మొదలు పెట్టారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8.30గంటల వరకు నల్లగొండ జిల్లాలో సగటున 50.2మి.మీల వర్షపాతం నమోదైంది. డివిజన్ల వారీగా పరిశీ లిస్తే దేవరకొండ డివిజన్‌లో అత్యధికంగా 621.4 మి.మీల వర్షపాతం నమోదు అయింది. డివిజన్‌లో అత్యధికంగా గుర్రంపోడు 115.2 మి.మీలు, కొండమల్లేపల్లి 102.8మి.మీలు, దేవరకొండలో 103.8మి.మీలు చందంపేటలో 94.1మి.మీలు, చింతపల్లిలో 93.3మి.మీలు, పీఏపలిల్లో 82.9 మి.మీల వర్షపాతం నమోదైంది. నాంపల్లిలో 58.8మి.మీలు, చండూరులో 57.1మి.మీలు, మునుగోడులో 43.8 మి.మీల వర్షం పడింది. అనుములలో 47.9 మి.మీలు, వేములపల్లిలో 64.1 మి.మీలు, మిర్యాలగూడలో 58.6మి.మీలు, దామచర్లలో 62.1మి.మీలు, పెద్దవూరలో 57.1మి.మీల వర్షం పడింది. శాలిగౌ రారంలో 68.3మి.మీలు, కట్టంగూరులో 40.8మి.మీలు, నకిరేకల్ 47.8మి.మీలు, తిప్పర్తిలో 50.2మిమీలు, కనగల్‌లో 39.4మి.మీల వర్షం కురిసింది. వర్షం పడడంతో జిల్లాలో వాతావరణంలో మార్పు వచ్చింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సోమ వారం నాడు గరిష్ఠ ఉష్ణోగ్రత 34.5డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. తీవ్ర ఎండలతో సతమతమైన ప్రజలు వాతావ రణంలో మార్పులు రావడంతో జిల్లా ప్రజలు ఊరట చెందారు.



నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో పొలం దున్నుతున్న రైతు

నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని దీపకుంట గ్రామంలో దుక్కి దున్ని పొలం సిద్ధం చేస్తున్న రైతు

తొలకరి పలకరించి..

తొలకరి పలకరించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. భూములను అరకలు, ట్రాక్టర్లతో చదును చేసుకొని దుక్కులు దున్నుతున్నారు. గతానికి భిన్నంగా నైరుతి రుతుపవనాలు పలకరించడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. మే నెలలో కురిసిన అకాల వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు నైరుతి ప్రభావంతో వర్షాలు పడడంతో సోమవారం నుంచే పల్లెల్లో సందడి మొదలైంది. విత్తనాలు చల్లడం ప్రారంభించారు.



స్టార్టర్ సరి చూసుకుంటూ..



విత్తనాలు నాటుతూ..



భూమిని దున్నకానికి సిద్ధం చేస్తున్న వ్యవసాయ కూలీలు



ట్రాక్టర్లతో భూమి దున్నుతున్న రైతులు



విత్తనాలు నాటుతున్న కూలీలు




పొలంలో ఎరువు సిద్ధం చేసుకొని.. భూమి దున్నుతూ..

హరిహరులకు విశేష పూజలు



ప్రధానాలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

● ప్రతిరోజూ 1000మందికి అన్నప్రసాద వితరణ

భువనగిరి అర్బన్, జూన్ 3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి శివాలయంలో స్ఫటిక మూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాల యంలో సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభి షేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు సోమవారం వివిధ విభాగాల ద్వారా రూ. 28,80,593ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ప్రతి స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణ సమయంలో నడక దారిలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈవో అడిగి తెలుసుకున్నారు. కొండ కింద సత్రంలో 600మందికి అన్నప్రసాదం అందజేస్తుండగా సోమవారం నుంచి 1000మందికి అన్నప్రసాదం అందజేసే కార్యక్రమాన్ని ఈవో భాస్కర్‌రావు ప్రారంభించి, భక్తులకు అన్నం వడ్డించారు. తూర్పు రాజగోపురం వద్ద కొనసాగుతున్న వీఐపీ (రూ. 150) ప్రత్యేక దర్శనం క్యూలైన్ పనులను ఆయన పరిశీలించారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

యాదగిరిపల్లిలో సౌమ్య అంత్యక్రియలు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 3: అమెరికాలో గత నెల 26వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుడ్ల సౌమ్య అంత్యక్రియలు సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిపల్లిలో ముగిశాయి. అమెరికాలోని తానా మహాసభ సభ్యులు, సౌమ్య బంధువుల సహకారంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సౌమ్య మృతదేహానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు నివాళులర్పించారు.



సౌమ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న విప్ అయిలయ్య

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

నేరేడుచర్ల, జూన్ 3: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై(50) లైంగిక దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలిపై అదే వీధికి చెందిన వానరాసి రాములు ఏడాది క్రితం లైంగిక దాడికి పాల్పడ్డాడు. కూలి పని చేసి జీవించే యడవెల్లి యాదగిరి నాలుగు రోజుల క్రితం ఆమెకు కూల్ డ్రింక్ తాపిస్తానని తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. సోమవారం బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు. బాధిత దివ్యాంగురాలిని వైద్య పరీక్షల నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఎస్ఐ తెలిపారు. భర్త దూరంగా ఉండటంతో బాధితురాలు తండ్రి వద్దే ఉంటోంది.

ఒక్కరోజులోనే కేసు ఛేదించిన పోలీసులు

తుంగతుర్తి, జూన్ 3: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని ఓ ఇంట్లో ఆదివారం ఉదయం దొంగతనం జరిగింది. ఈ కేసును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని ఒక్కరోజులోనే దొంగను అరెస్ట్ చేసి డబ్బులు రికవరీ చేశారు. సీఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు దొంగలించారని తుంగతుర్తి మండల కేంద్రంలోని నార్లపురం శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు క్లూస్‌టీమ్‌ను రంగంలోకి దింపి చుట్టు పక్కల ఇళ్లలోని సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించి దొంగతనం చేసిన అనుమానితుడిని మండలకేంద్రానికి చెందిన కల్లూరి సురేష్‌గా గుర్తించి ఇంటి వద్ద సోమవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని విచారించగా ఇంట్లో దొంగలించిన రూ.4లక్షల నగదు, మొబైల్ ఫోన్, మోటారు సైకిల్, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్ఐలు ఏడుకొండలు, మధునాయుడు, ఏఎస్ఐ భగవాన్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుళ్లు సతీష్, విజయ్‌కుమార్ హోంగార్డు రవి, వెంకన్నను డీఎస్పీ అభినందించారు.

కుటుంబకలహాలతో..

కోదాడ, జూన్ 3: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ ఎస్ఐ బి. శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నయానగర్‌కు చెందిన గాజుల రవి(36) ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య భువనేశ్వరి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి స్వగ్రామం బరాఖత్‌గూడెం వెళ్లింది. ఇంట్లో మద్యం తాగి లోపల గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం భార్య భర్తకు ఫోన్ చేస్తే ఎంతకు ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి కోదాడకు వచ్చింది. బయట నుంచి తలుపులను కొట్టినప్పటికీ తీయకపోవడంతో ఇంటి పక్కవారిని పిలిపించి తలుపులు తెరిచి చూశారు. అప్పటికే రవి మృతిచెంది ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నల్లగొండ జిల్లాకేంద్రం శివారు దుప్పలపల్లి సమీపంలో లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్ హాల్

లెక్కింపునకు సర్వం సిద్ధం

నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల నుంచి గెలిచేదెవరో నేడు తేలిపోనుంది. నల్లగొండ లోక్ సభ స్థానానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాముల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో కొనసాగుతుంది. భువనగిరి లోక్‌సభకు సంబంధించి భువనగిరిలోని అరోరా కాలేజీ ప్రాంగణంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ఆసాంతం పకడ్బందీగా కొనసాగేందుకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు దాసరి హరి చందన, హనుమంతు కే.జెండగే నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8గంటలనుంచే మొదలయ్యే కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఫలితాలు వెలువడనున్నాయి. నల్లగొండ లోక్‌సభలో తక్కువ రౌండ్లున్న మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొదటి ఫలితం వెలువడనుండగా, చివరగా దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం వెలువడుతుంది.



నల్లగొండలోని సమాచార కేంద్రం



భువనగిరిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర



నల్లగొండలో ఏర్పాటు చేసిన టేబుళ్లు



నల్లగొండలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



భువనగిరిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ జెండగే



భువనగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్



భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లు

అనంతరామశర్మ మృతి తీరని లోటు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

కట్టంగూరు, జూన్ 3: స్వాతంత్ర సమరయోధుడు, సీపీఎం రాష్ట్ర నాయకుడు అనంతరామశర్మ మృతి రాష్ట్ర ప్రజలకు, సీపీఎం పార్టీకి తీరనిలోటని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అనంతరామశర్మ సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల పక్షాన పోరాడిన మహనీయుడు అని కొనియాడా రు. అనేక నిర్బంధాల నడుమ పేద ప్రజల కోసం దోపిడీ, అసమానతలు లేని స మాజం కమ్యూనిస్టులతోనే సాధ్యమని ఆయన బలంగా నమ్మేవారని తెలిపారు. నేడు మతోన్మాద శక్తులైన బీజేపీపై పోరాడేందుకు ఆయన స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తుమ్మల వీరారెడ్డి, మల్లేష్, కందాల ప్రమీల, నర్సిరెడ్డి, కట్ట బక్కయ్య, రామస్వామి, జాల రమేష్, గుండమల్ల రామస్వామి, భిక్షం, హనుమంత్, పనస సైదులు, యాదగిరిశర్మ, సురేష్‌శర్మ, నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడరూరల్, జూన్ 3: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని సామగాని తండాలో బొడ్రాయి ప్రతిష్ట వేడుకలను భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండి పాడి, పంటలతో సుభిక్షంగా ఉండాలని అన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు


పైప్‌లైన్ల సమస్యను పరిశీలిస్తున్న మునిసిపల్ నాయకులు

హాలియా, జూన్, 3: హాలియా మునిసిపాలిటీ 11వ వార్డు అంగడిబజార్ నిర్మల స్కూల్ రోడ్డు, రామచంద్రనగర్‌లో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లే కుండా చూస్తానని హాలియా మునిసిపల్ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి అన్నారు. మునిసిపాలిటీ వాటర్ పైప్‌లైన్, మిషన్ భగీరథ పైపులైన్లలో మంచినీటి సరఫరాలో ఇబ్బంది ఉందన్న సమాచారాన్ని తెలుసుకొని సోమవారం ఆయన తక్షణమే ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రాంత ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా వీలైనంత త్వరతా మరమ్మతులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిల ర్, జిల్లా కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి యడవల్లి నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.

మొదటి ప్రతిపాదన ప్రకారమే బైపాస్ ఏర్పాటు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

నల్లగొండ రూరల్, జూన్ 3: నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేయనున్న జాతీయ రహదారి 565 బైపాస్ రోడ్డును మొదటి, రెండో ప్రతిపాదనల మేరకే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం, పట్టణ కార్యదర్శి ఎండీ సలీం అన్నారు. నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తక్కువ నష్టం ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా నిర్మాణం చేపట్టాలని కోరారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ హైవేస్ అర్అండ్‌బీ వారి ప్రతిపాదనల ప్రకారం నల్లగొండ పట్టణానికి 565 రహదారి నిర్మాణం కోసం మూడు ప్రతిపాదనలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చినట్లు తెలిపారు. తక్కువ నష్టం ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా నిర్మాణం చేపట్టాలని కోరారు. రెండు ప్రతిపాదనల ద్వారా ప్రజలకు కొంత ఊరట లభిస్తుందని అన్నారు. కొంత మంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం మూడవ ప్రతిపాదన ద్వారా నిర్మాణం చేపట్టాలని చుస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజల నివాసాల ఇళ్లు, ప్లాట్లు పోయి భారీ నష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు నష్టం జరిగే విధంగా నిర్మాణాలు చేపడితే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, నర్సింహ, కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపిచంద్

దేవరకొండ, జూన్ 3: దేవరకొండ నియోజకవర్గంలో అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ, అధిక ఫీజులు వసూళ్లు చేస్తు న్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమాల గోపిచంద్ అన్నారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సం ఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు అమ్ముతూ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. యూనిఫాం, షూ, బుక్స్, స్టేషనరీ అమ్మకూడదని, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అమలు చేయడం లేదని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది'

మర్రిగూడ, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 10 నుంచి 12 సీట్లను కైవసం చేసుకుంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు మేకల జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మర్రిగూడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగెత్తి ఉన్నారని, కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, సుస్థిరపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, నాయకులు నక్క తిరుపతయ్య, వెంకటంపేట బాలయ్య, రమావత్ శ్రీనివాస్, అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నవర్షానికే కుంటలుగా రోడ్లు


మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయం ఎదుట పరిస్థితి

మిర్యాలగూడ టౌన్: వర్షాకాలం రానే రాలేదు.. పట్టుమని పెద్ద వర్షమైనా కురవలేదు.. అయినా అడుగులోతు వరద నీరు నిలిస్తోంది. అందుకు కారణం ప్రణాళికాధికారుల నిర్లక్ష్యమే.. తమదైన ఇంజనీరింగ్ అనుభవంతో పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన మునిసిపల్ ఇంజనీర్లు ముందు చూపు లేకుండా నిర్మించిన రహదారుల కారణంగా పలు కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని మునిసిపల్ ఆఫీసును ఆధునీకీకరించిన ఇంజనీర్లు కార్యాలయం ఎదుట రహదారులను విస్తరించారు. అయితే ప్రణాళికా రహితంగా విస్తరణ జరగడంతో వర్షపు నీరు భారీగా నిలుస్తోంది. మునిసిపల్ కార్యాలయంతో పాటు సంతోష్‌నగర్, శాంతినగర్, కృష్ణాకాలనీలకు వెళ్లే రహదారి వరదనీటితో నిండి జలపాతాన్ని తలపిస్తోంది.

ప్రాంగణమిలా.. ప్రయాణమెలా..?


ఆర్టీసీ బస్టాండు ప్రధానద్వారం వద్ద నిలిచిన వర్షపు నీరు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. బస్టాండులోకి వెళ్లే దారంతా వరదనీటితో నిండిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వాహనదారులు ఇబ్బందిపడుతూ ఎలాగోలా లోనికి వచ్చేస్తుండగా పాదచారులు బురద నీటిలో ప్రాంగణంలోని రాలేని పరిస్థితి ఉంది. ప్రయాణికులు తీ వ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ఎలా ఉంటుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చే స్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగునీరు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని తొలగిస్తున్న బాధితులు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 5వ వార్డులోని అయ్యప్ప కాలనీకి వెళ్లే దారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయ్యప్ప గుడి ఎదురుగా ఏర్పాటైన అయ్యప్ప కాలనీకి వెళ్లాలంటే మాజీ వార్డు సభ్యుడు ఆజీజ్ ఇంటి ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా వెళితే తక్కువ దూరం అవుతుంది. దీంతో కాలనీవాసులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే చుట్టుపక్కల ఉండే నివాసాల నుంచి వచ్చే వ్యర్థనీరు కాల్వ లేకపోడంతో రోడ్డుపైనే ప్రవహిస్తూ రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఈ సమస్యను గ్రామ పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీని నిర్మించి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

కురిసింది వాన...

- జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం
- వ్యవసాయ పనులలో నిమిగ్నమైన రైతులు

దేవరకొండ, కొండమల్లేపల్లి, శాలిగౌరారం, జూన్ 3: జిల్లాలో ఆదివారం అర్ధరాత్రితో పాటు సోమవారం పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తీవ్రమైన ఎండలతో అల్లాడుతున్న జనం తాజా వర్షంతో కొంత ఉపశమనం పొందారు. వర్షం కురియడంతో రైతులు దుక్కులు దున్నుకోవడానికి వర్షం అనుకూలించింది. దీంతో భూములను చదును చేసుకొని విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.


గౌరికుంటతండాలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు, వర్షానికి తడిసిన నోట్లు

● దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో చందంపేట, దేవరకొండ, కొండమల్లేపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ ఏడాది లక్ష 71వేల ఎకరాల వరకు పత్తిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అన్ని రకాల పత్తి విత్తనాలు దుకాణాల్లో సిద్ధంగా ఉన్నాయని ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నట్లు దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ తెలిపారు. రైతులు ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రశీదు తీసుకోవాలని కోరారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలోని గౌరికుంటతండాలో భారీ


శాలిగౌరారం: కొత్తపల్లి కందికుంట చెరువు అలుగుపోస్తున్న దృశ్యం


కొండమల్లేపల్లి: గౌరికుంటతండాలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

వర్షంతో మోకాళ్ల లోతు నీళ్ల చేరడంతో పాటు ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు ఇళ్లలో చేరడంతో ఇంటిలోని సామగ్రి, వంట సరుకులు, బియ్యం, జొన్నలు తడిసిపోగా కరెన్సీ నోట్లు సైతం వర్షానికి తడిసిపోయాయి. సోమవారం తెల్లవారుజామున జడ్పీటీసీ సలహాదారుడు పస్నూరి యుగంధర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● శాలిగౌరారం మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము దాకా భారీ వర్షం కురిసింది. దాదాపు 6.5 సెం.మీల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయమయ్యాయి.

రైతులు దుక్కులు దున్నుకోవడానికి వర్షం అనుకూలించింది. ఇదిలా ఉండగా శాలిగౌరారం మండలంలోని కొత్తపల్లి కందికుంట, గారకుంటలో, రామాంజపురం కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టులోకి మూసీ నది ద్వారా భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.5అడుగుల నీరు వచ్చింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు కుంటల్లోకి, చెరువులోకి క్రమేపి నిండుతున్నాయి.

కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి

- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

నల్లగొండ, జూన్ 3: గత పదేళ్లలో ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మూడో రోజు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం కార్యాలయంలో వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనేది గుర్తు చేస్తూ కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకంతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను పెద్దఎత్తున అమలు చేసినట్లు తెలిపారు. పాటు పింఛన్లను కూడా దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలోనే అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందన్నారు. రుణమాఫీ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు తొలగుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి గురించి


నల్లగొండ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న రవీంద్రకుమార్

ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, జడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు రామచంద్రనాయక్, రెగట్టే మల్లికార్జున్ రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, దేప వెంకట్ రెడ్డి, అయితగోని యాదయ్య, లోడంగి గోవర్ధన్, యాట జయప్రదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత


ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న నాయకులు

గట్టుప్పల్, జూన్ 3: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో బీరప్ప కామరతి గుడిలో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. మండల కేంద్రానికి చెందిన కుండె వెంకటేశం జయం ఫౌండేషన్ ద్వారా గ్రామానికి చెందిన దళితులకు అందజేసిన డప్పులను తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, వలిగొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోనపురి కవిత, మంగ వెంకటేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీరప్ప గొర్రెల పెంపకదారుల అధ్యక్షుడు కుండె సత్తయ్య, గట్టుప్పల కురుమ సంఘం అధ్యక్షుడు కుండె శ్రీశైలం, నాయకులు మందుల నరసింహ, బండ వేణు, బొడిసె శ్రీశైలం, చంద్రయ్య, కులపెద్దలు పాల్గొన్నారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతాంగం

- పత్తి విత్తనాలు విత్తేందుకు ఏర్పాట్లు

మర్రిగూడ, జూన్ 3: పత్తి రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్నుకుని పత్తి విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్న రైతులకు ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి దుక్కుల్లో పత్తి విితనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. మండలంలో 34 వేల ఎకరాలు ఉన్నాయని, గతంలో 29 వేల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలను సాగు చేయడమే కాకుండా 5 వేల ఎకరాల్లో వరిని సాగు చేశారు. ఈ ఏడాది 32 వేల ఎకరాలకుపైగా రైతులు పత్తి విత్తనాలు వేయడానికి ముందస్తుగానే దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉన్న రైతులకు వర్షాలు కురియడంతో సాగుకు సిద్ధమై పత్తి విత్తనాలు వేయడంలో నిమగ్నమయ్యారు. వరుణదేవుడు కరుణించడంతో దుక్కులు దున్నుకున్న భూములు వేడితాపం నుంచి చల్లబడగా రైతులు పత్తి విత్తనాలు వేయడానికి సిద్ధమయ్యారు.


మర్రిగూడలో పత్తి విత్తనాలను విత్తుతున్న కూలీలు

పాలిసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


బెక్కం పవన్


దువ్వ ప్రేమ్‌చంద్


కొర్ర నితిన్


శ్రుతి

కొండమల్లేపల్లి, జూన్ 3: పాలీసెట్ ఫలితాల్లో కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో కొండమల్లేపల్లి పాఠశాలకు చెందిన బెక్కం పవన్ 120 మార్కులకు గాను 113 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 149వ ర్యాంకును సాధించాడు. అలాగే ఎటెల్లి శృతి 1,345 ర్యాంకు, దువ్వ ప్రేమ్‌చంద్ 7,291 ర్యాంకు, కొర్ర నితిన్ 8,437 ర్యాంకు సాధించారు. వేసవి సెలవుల్లో పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కొలనుపాక శ్రీపతిరావు జూమ్ యాప్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం చేరుపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గిరి లక్ష్మయ్య, సూర్యనాయక్, సైదానాయక్, జనార్ధన్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్, జగదీశ్, లోక్య నాయక్ అభినందించారు.

సంక్షిప్త సమాచారం...

మర్రిగూడ: ఆదర్శ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న 6వ, తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ సర్వాపరాణి తెలిపారు. 6వ తరగతిలో సీట్లు ఖాళీగా ఉండటమే కాకుండా ఇంటర్ మొదటి సంవత్సరంలోని అన్ని గ్రూపుల్లో సీట్లు ఖాళీ ఉన్నందున ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోకుండా నేరుగా పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు అందజేసుకోవాలని ఆమె సూచించారు.

మునుగోడు రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కూరెళ్ల వెంకట ఉదయ్‌కృష్ణ మృతిపై తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని కొరటికల్ గ్రామంలో సోమవారం ఉదయ్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పోగుల ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి, వివిధ పార్టీల నాయకులు వేదాంతం గోపినాథ్, బొడిగ అశోక్, సాగర్ల లింగస్వామి, నరేందర్, రాజేష్, బుచ్చయ్య, సురేష్, నరేష్ చారి, అశోక్, సుధీర్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొబైల్ ఫోన్‌లో ఎలక్షన్ రిజల్ట్ అని పీడీఎఫ్‌లు వస్తున్నాయని ఎవరూ ఓపెన్ చేయవద్దని సూచించారు. పీడీఎఫ్‌లు ఓపెన్ చేస్తే మీ బ్యాంకు ఖాతా వివరాలు సైబర్ నేరగాళ్లకు వెళ్తున్నాయని అన్నారు. ఎవరూ కూడా పీడీఎఫ్‌లు ఓపెన్ చేయవద్దని, వచ్చిన పీడీఎఫ్‌లను మరొకరికి షేర్ చేయవద్దని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

శాలిగౌరారం: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని, నిరుద్యోగులకు, పేదలకు ఒరిగిందేమీ లేదని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలో నిరుద్యోగులు, పేదల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నిమ్మల సురేష్, షేక్ సయ్యద్, చాడ శ్యామ్‌సుందర్‌రెడ్డి, బండారు లక్ష్మయ్య, చిప్పలపెల్లి అంజయ్య పాల్గొన్నారు.

దామరచర్ల: మండలంలోని కల్లెపల్లి బంగారు మైసమ్మ దేవాలయం వద్ద 2024-25 సంవత్సరానికి గాను దున్నపోతులను సేకరించడం, లడ్డూ, పులిహోర, కొబ్బరికాయల అమ్మకాలు, తలనీలాలు సేకరించే హ క్కుల కోసం ఈ నెల 7న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ధీరావత్ భాష్యానాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునే, దున్నపోతులు సేకరించుకునే హక్కు కోసం రూ.లక్ష డిపాజిట్, పూలదండలు, నిమ్మకాయలు, కొబ్బరిచిప్పలు సేకరించేందుకు రూ.50వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

నల్లగొండ టౌన్: పట్టణంలో ఇండియన్ గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందుల లేవని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజింగ్ పార్ట్‌నర్స్ వేణుగోపాలరావు, వెంకటరమణరావు తెలిపారు. రెండు మూడు రోజులుగా కొంత మంది డెలివరీ బాయ్స్ కారణంగా సరఫరాలో కాస్త గ్యాప్ వచ్చిందని అన్నారు. అంతే తప్ప సోషల్ మీడియాలో వస్తున్న వాటిలో నిజం లేదన్నారు. తమ వినియోగదారులకు అవసరమైన సిలిండర్ల స్టాకు తమ వద్ద సిద్ధంగా ఉందన్నారు. వినియోగదారుల ఇంటి వద్దకే గ్యాస్ సకాలంలో సరాఫరా చేయనున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: సామాజిక సేవే లక్ష్యంగా నాయి పిల్లర్స్ అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ముత్తిరెడ్డికుంటలో మృతి చెందిన యాదగిరి కుటుంబ సభ్యులకు నాయి పిల్లర్స్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద నాయిబ్రాహ్మణ కుటుంబాలకు, ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంచరణ్, సంతోష్, సాయి, అభి, ప్రశాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా దేవరకొండ పట్టణానికి చెందిన వస్కుల సత్యనారాయణ, కార్యదర్శిగా ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ గాజుల రాజేష్, డాక్టర్ పీజే శ్యాంసన్ ప్రకటించారు. సోమవారం దేవరకొండలో లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక జరిగిందని, కోశాధికారిగా చిలుకూరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ సభ్యులు చీదేళ్ల వెంకటేశ్వర్లు, వనం బిక్షమయ్య, శ్రీనివాసులు, బెజవాడ నరేందర్ పాల్గొని నూతన కమిటీని అభినందించినట్లు తెలిపారు.

చండూరు: చండూరు పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు హనుమాన్ సేవా సమితి మండల అధ్యక్షుడు చిలుకూరి పరమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పార్టీ ద్వారా సేకరించిన రూ.70వేలు కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ కార్యకర్తలకు తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

రేపటి నుంచి శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామి జాతర

- జాతరకు ముస్తాబవుతున్న ఆలయం

వేములపల్లి, జూన్ 3: మండలంలోని రావులపెంట గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్యస్వామి జాతరను ఈనెల 5 నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు జిన్న నాగిరెడ్డి, అవిరెండ్ల వేణు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రావులపెంట గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామివారి 14వ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5,6 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5న సుప్రభాత సేవ, మంగళ తోరణాలు, విగ్రహాలకు అభిషేకాలు, 6న గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, 7న అమ్మవారి బోనాలు, కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ జాతరకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై తమ మొక్కులను చెల్లించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం మిర్యాలగూడ, సూర్యాపేట నుంచి బస్సు సౌకర్యం కల్పించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.